రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





బుధవారం | 25-2-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 602 పేజీలు: 2 వెల : రూ.7




# చెత్త.. చెత్తగా..!

- ✳ స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర.. ప్రకటనలకేనా?
- ✳ లక్షలు వెచ్చించినా.. నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- ✳ సంపద తయారీ కేంద్రమున్నా వినియోగించని వైనం
- ✳ బహిరంగ ప్రదేశాల్లో తగలబెడుతున్న చెత్త
- ✳ కాలుష్యంతో రోగాల బారిన ప్రజలు
- ✳ చోద్యం చూస్తున్న అధికారులు

**ఉలవపాడు, ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచారం చేయడమే గాకుండా ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అంతేగాకుండా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి నిర్మించిన 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు' నిర్మించాయి. అయితే కొందరు అధికారుల తీరు వల్ల ఆ కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల్లోని చెత్తను తీసుకెళ్లి సంపద కేంద్రాల్లో ఉంచి సిబ్బంది ద్వారా ఎరువుగా మార్చి పంచాయతీకి ఆదాయం తీసుకు రావాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం యోచించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ చెత్త సంపద కేంద్రాలు వినియోగించాలని ఆదేశాలు ఇచ్చినా కొందరు అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇవి మూలకుచేరాయి. దీంతో గ్రామాల్లో తడి, పొడి చెత్త నిల్వ చేయలేక రోడ్లు, పొలాలు, చెరువుల వద్ద వ్యర్థాలను వేస్తున్నారు. ఈ కోవలోనే ఉలవపాడు మండలంలోని పలు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు అధికారుల నిర్లక్ష్యం వల్ల తన ఉనికిని కోల్పోతున్నాయి. చెత్తను శుద్ధిచేసి ఆదాయం గడించాల్సిన ఈ కేంద్రం, ప్రస్తుతం నివాస గృహంలా మారిపోయింది.

గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో ఎరువుగా మార్చాలన్న లక్ష్యం ఇక్కడ ఎక్కడా కానరావడం లేదు. కేంద్రంలో కనీసం చెత్త సేకరణ గానీ, విభజన ప్రక్రియ గానీ జరగడం లేదు. విభాగాలుగా విడగొట్టి సంపదను సృష్టించాల్సిన చోట... అంతా అస్తవ్యస్తంగా తయారైంది. సంపద తయారీకి కేటాయించిన భవనాలు ప్రస్తుతం పంచాయతీ కార్మికులకు ఆవాసాలుగా మారాయి. గ్రామం నుంచి సేకరించిన వ్యర్థాలను కేంద్రానికి తరలించాల్సింది పోయి, సమీపంలోని కాలువ గట్టున కుప్పలుగా పోసి తగలబెడుతున్నారు. ఇంత జరుగుతున్నా పలు పంచాయతీల సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఉలవపాడు గ్రామంతో పాటు కరేడు గ్రామంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామానికి దూరంగా తయారీ కేంద్రం ఉండటంతో చెత్తను తరలించడం లేదు. దీంతో ఆ కేంద్రాలు అసాంఘిక కలాపాలకు నిలయంగా మారిపోయాయి. ఎంపీడీవో కార్యాలయానికి కూతవేట దూరంలో జాతీయ రహదారి వెంబడి చెత్తను వేసి తగులపెడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి, ఈ కేంద్రాన్ని మళ్లీ వాడుకలోకి తీసుకురావాలని, చెత్త సేకరణ, విభజన సక్రమంగా జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.







జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
ప్రకాశం





## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పరిశీలించిన ఎంపీడీవో

**లింగసముద్రం ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** మండలంలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే త్వరితగతిన పూర్తిచేసేలా సిబ్బంది పని చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని అన్నేబోయినపల్లి గ్రామంలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. త్వరగా సర్వేలు పూర్తి చేయాలని ఆ విధంగా ప్రణాళికాబద్ధంగా సర్వేను నిర్వహించాలని సిబ్బందికి చెప్పారు. సర్వే చేసే సిబ్బంది సర్వే పట్ల అలసత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యంగా వ్యవహరించిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



## అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం తప్పదు

**ఉలవపాడు, ఫిబ్రవరి24 (జాతీయ వార్త):** అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాబోయే కాలంలో రాష్ట్రప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అంగన్వాడీలకు కనీసవేతనం 26వేలు పెంచాలని, హెల్పర్ల ప్రమోషన్ల విషయంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, మే నెలలో వేసవి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉలవపాడు సిడిపిఓ కార్యాలయం వద్ద మంగళవారం ప్రాజెక్టు పరిధిలోని హెల్పర్లు రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏడు సంవత్సరముల నుండి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా అంగన్వాడీలను ఇబ్బందులుపాలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయలేదని, మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు, మంత్రులు శిబిరం దగ్గరకు వచ్చి వాగ్దానంచేశారని, కానీ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన అంగన్వాడీలపట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను సామరస్య పూర్వకంగా, పరిష్కారం చేయాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి వేతనాలు సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ దీక్షలలో సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్ పాల్గొని మాట్లాడారు.సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొట్టే.వెంకయ్య, ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలు, చిరితోటి ఇందిరావతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం సుభాను ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్స్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, బి.వరలక్ష్మి, కే.సుమ, అక్కిలగుంట మరియమ్మ, ఎం.డి రేష్మ, కే శోభారాణి, ఏం.సుశీల, జె. శ్రీవల్యా, వాయల అంజమ్మ, బి.ప్రియాంక, బి.థెరిస్సా, మధులత, రజిని, జి.సంధ్య, కే అంజమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి



**లింగసముద్రం ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం ఆయన అన్నెబోయినపల్లి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. వివిధ పనుల కోసం సచివాలయంకు వచ్చే వారి పనులను త్వరితగతిన పూర్తిచేశాలా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించి వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**లింగసముద్రం ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** లింగసముద్రం టౌన్ , వెంగలాపురం, అంగిరేకులపాడు ఫీడర్లలో ఆర్డిఎస్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఐ షేక్ ఫిరోజ్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే జనార్ధన్



**ఒంగోలు, ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** అమరావతి సచివాల యంలో ఉపముఖ్యమంత్రి, జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్‌ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్చించారు.

## విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యం.. నారాయణ లక్ష్యం



**కందుకూరు, ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** నారాయణ విద్యా సంస్థలో చదివే ప్రతి ఒక్కరికి ఉన్నత విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే నారాయణ లక్ష్యం అని క్లస్టర్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని నారాయణ స్కూల్ లో ప్రిన్సిపల్ అనీస్ భాను ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడికల్ క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్ లో ముఖ్య అతిథులుగా ఎల్.వి ప్రసాద్ వైద్యశాల కంటి నిపుణులు డాక్టర్ సల్మాన్ ఖాన్, కృష్ణ సాయి హాస్పిటల్ నుండి దంత నిపుణులు డాక్టర్ మనోజ్, సురక్ష వైద్యశాల నుండి గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్తి లు పాల్గొని విద్యార్థి, విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం ఉంటేనే చదువుపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నపిల్లలకు సైతం కంటి సమస్యలు వస్తున్నాయని వాటిని ముందుగా గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం వలన భవిష్యత్తులో కంటి సమస్యలు అధిగమిస్తారని ఆమె అన్నారు. ప్రస్తుతం మనం తినే ఆహారంలో మార్పులు ఉండటం వలన బాలికలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తమ తల్లిదండ్రులకు సైతం చెప్పుకోలేని కొన్ని సమస్యలు వారు ఎదుర్కొంటున్న పరిస్థితిలో ఉన్నారని వాటిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు బాలికలలో తలెత్తకుండా ముందు జాగ్రత్తగా బాలికల తల్లిదండ్రులు గమనించాలని ఆమె తెలిపారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలికలకు సైతం గైనకాలజిస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఎవరైనా అటువంటి సమస్యలు ఎదుర్కొంటుంటే వారి తల్లిదండ్రులను సంప్రదించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాటలను నిజం చేయాలంటే మన ఆహార అలవాట్లను కొంత మీద మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. ప్రిన్సిపాల్ అనీస్ భాను మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో చదువుకునే ప్రతి ఒక్కరికి మంచి విద్యను అందిస్తూ, ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వారి బంగారు భవిష్యత్తు కి నారాయణ విద్యాసంస్థలు బాటలు వేస్తుందని ఆమె అన్నారు. క్రమశిక్షణతో పాటు, విద్య ఆరోగ్యం అందించటమే నారాయణ ప్రధాన లక్ష్యం అని ఆమె అన్నారు. అక్షరాసుల తల్లిదండ్రులను సైతం తీర్చిదిద్దే విధంగా విద్యార్థులను నారాయణ విద్యాసంస్థలు తయారు చేస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మస్తానయ్య, ప్రశాంత్, అకాడమిక్ డీన్ జానీ, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీలక్ష్మి, తేజస్విని, ఏఎన్ఎం శైలజ, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**ఉలవపాడు, ఫిబ్రవరి 24 (జాతీయ వార్త):** ఉలవపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరమును ఉలవపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రెండు జిల్లాలలోను అనేక గ్రామాలలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని నెల్లూరు నారాయణ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వైద్య శిబిరంలో వందమందికి కంటి పరీక్షలు చేయగా అందులో 20 మందిని శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి ఆస్పత్రికి ప్రత్యేక వాహనం ద్వారా బుధవారం ఉదయం ఏడు గంటలకు తీసుకు వెళ్తున్నట్లు పిఆర్ఓ. ఎస్ రాఘవేంద్రరావు తెలిపారు. రోగులందరి ఉచితంగా చికిత్స, రవాణా, మందులు, భోజన వసతి కల్పిస్తామని, శస్త్ర చికిత్స అనంతరం పాలో అప్ ట్రీట్మెంట్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలలో ఇలాంటి వైద్య శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేసి పేదలందరికీ సేవలందిస్తామని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం విజయవంతం కావటానికి సహకరించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్బారావుకి, ఉలవపాడు గ్రామంలోని నాయకులకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు సీఎం చంద్రబాబు మార్కాపురం జిల్లా పర్యటన

### ❋ సాగర్ జలాశయానికి నీటిని తరలించే ఫీడర్ కెనాల్ శంకుస్థాపన
### ❋ మార్కాపురంలో బహిరంగ సభ ❋ బందోబస్తు ఏర్పాట్లు
### పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు, ఫిబ్రవరి 24 (జాతీయవార్త):** మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలోని సొరంగాల నుంచి సాగర్ జలాశయానికి నీటిని తరలించే ఫీడర్ కెనాల్ శంకుస్థాపన కార్యక్రమం, మార్కాపురం జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు.. బందోబస్తు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సిబ్బందికి బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ప్రారంభం నుండి ముగిసే వరకు బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వారికి కేటాయించిన స్థలాలకు నిర్దేశించిన సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. హెలిప్యాడ్, సభ వేదిక, వీఐపీ రూట్ బందోబస్తు, గ్యాలరీలు, మఖ్యంగా పార్కింగ్ ప్రదేశాలలో భద్రతాపరమైన అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సభ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ బందోబస్తు నిమిత్తం ఇద్దరు ఏఎస్పీలు, 9 మంది డిఎస్పీలు, 37 సీఐలు, 90 మంది ఎస్ఐలతో పాటు 1162 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్ఎస్ జి అడిషనల్ ఎస్పీ ఎస్.వి.రమణ,నెల్లూరు అడిషనల్ ఎస్పీ శ్రీమతి సిహెచ్ సౌజన్య, పల్నాడు అడిషనల్ ఎస్పీ వి. సత్తిరాజు, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**లింగసముద్రం ఫిబ్రవరి24 (జాతీయ వార్త):** విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదివినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అన్నారు. మంగళవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సరస్వతి పూజ, ఫేర్వెల్, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో క్రమశిక్షణతో చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చునని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని, అందుకు ఎంతోమంది పూర్వ విద్యార్థులు నిదర్శనమని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా నిరంతరం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠాలను బోధించడం జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. ఉపాధ్యాయులు ఇప్పటివరకు చెప్పిన పాఠాలను గుర్తు పెట్టుకుని పరీక్షల్లో రాసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు.పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలను సాధించాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ ఫిజిక్స్ ఉపాధ్యాయులు మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు వేసిన కోలాటం ఆధ్యాంతం కోలాటంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అలరించాయి. వార్షికోత్సవం సందర్భంగా భోజన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546